క్లుప్తంగా

అన్‌మ్యాన్డ్ కార్మికుల వేతనాలు పెంపు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ శాఖలో అన్‌మ్యాన్డ్ కార్మికులకు వేతనాలు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని సీఐటీయూ అనుబంధ యూఈఈయూ సంఘ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కిల్ కార్మికులకు, ఐటీఐ అర్హత లేని కార్మికులకు కూడా దసరా కానుకగా సంస్థ వేతనాలను పెంచిందని యూనియన్ కంపెనీ కార్యదర్శి ఎం. ప్రసాద్, జిల్లా ప్రతినిధులు తెలిపారు.

సీఎంను కలిసిన ముస్తఫా

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎండీ.ముస్తఫా శుక్రవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి నివాసంలో సీఎంను కలిసిన ఆయన పుష్పగుచ్ఛం అందించారు.

కత్తితో బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు

రఘునాథపాలెం: పాత కక్షల నేపథ్యాన ఓ వ్యక్తి కత్తితో బెదిరించడంతో పాటు అద్దం ధ్వంసం చేసిన సంఘటన మండలంలోని బూడిదంపాడులో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎం. గోపి మెడికల్ షాపులో ఉండగా.. గోపితో పాటు అతడి మిత్రులపై అదే గ్రామానికి చెందిన ఎస్.రమేశ్ కత్తితో బెదిరింపులకు పాల్పడటంతో పాటు, అద్దం ధ్వంసం చేశాడు. దీంతో పాత కక్షల నేపథ్యాన ఈ చర్యలకు పాల్పడినట్లు గోపి పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేయడంతో సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మనసారా తరించేలా..

శక్తి ఆరాధనకు ప్రాధాన్యతనిచ్చే పండుగ దసరా. చెడుపై మంచిని సాధించిన విజయానికి గుర్తుగా ఈ వేడుకలు నిర్వహించనుండగా.. ఊరూ, వాడా కోలాహలంతో నిండుకుంది. నేడు(శనివారం) పండుగకు సుదూర ప్రాంతాల్లో ఉన్నవారు, కొత్త అల్లుళ్లు ఊళ్లకు చేరుకోవడంతో ఇళ్లన్నీ కళకళలాడుతున్నాయి. విజయ దశమి సెంటిమెంట్‌గా పలువురు వాహనాలు, వస్తువుల కొనుగోళ్లకు ప్రాధాన్యం ఇస్తుండడంతో దుకాణాలన్నీ కొనుగోలుదారులతో బిజీబిజీగా మారాయి. – ఖమ్మంగాంధీచౌక్



విద్యుత్ లైట్ల అలంకరణలో జమ్మిబండ

దసరాకు ముస్తాబు

- ఊరూ, వాడా సంతరించుకున్న ఆధ్యాత్మిక శోభ
- ఆలయాల్లో పూజలకు ఏర్పాట్లు
- నేడే విజయదశమి వేడుకలు

విజయానికి చిహ్నంగా..

ఆశ్వాయుజ శుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకు తొమ్మిది రోజుల పాటు శ్రీదేవి నవరాత్రులు, పదో రోజు విజయ దశమి కలిసి దసరా జరుపుకోవడం హిందువుల ఆచారం. రాముడు, రావణుడిపై గెలిచిన రోజుగానే కాకుండా పాండవులు వనవాసానికి వెళ్తూ జమ్మిచెట్టుపై ఉన్న తమ ఆయుధాలను తిరిగి తీసిన రోజని, దుర్గాదేవి మహిషాసురడనే రాక్షసుడితో నవరాత్రులు యుద్ధం చేసి వధించిన రోజని చరిత్ర చెబుతోంది. దీంతో విజయ దశమి రోజున రావణ వధ, జమ్మి ఆకుల పూజ చేయడం సంప్రదాయంగా వస్తోంది.

స్వామివారి ఊరేగింపు ఇలా..

శనివారం సాయంత్రం 5 గంటలకు గుట్టపై ఆలయం నుంచి స్వామివారిని పల్లకి సేవలో ఊరేగింపును ప్రారంభిస్తారు. 6:30 గంటలకు జమ్మిబండపైకి చేర్చి 9:30 గంటల వరకు భక్తుల దర్శనార్థం ఉంచుతారు. అనంతరం రావణాసురిడి దహన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి వేలాది మంది భక్తులు రానుండడంతో ప్రత్యేక దర్శనాలకు బారికేడ్లను ఏర్పాట్లు చేస్తున్నారు. అంబేడ్కర్ సెంటర్, జిల్లా పరిషత్, పాత కలెక్టరేట్, పాత బస్టాండ్, బోనకల్ రోడ్ ప్రాంతాలు రద్దీగా ఉండే అవకాశం ఉండడంతో పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది.

శమీ చెట్టు పూజ ఓ విశేషం..

దసరా రోజున శమీ(జమ్మి) చెట్టు పూజ ఓ విశేషం. ఈ చెట్టును పూజించాక దాని ఆకులను ఇంట్లోని పూజా స్థలం, ధన స్థానం, నగదు పెట్టెలో ఉంచడం వలన ధన వృద్ధి జరుగుతుందని ప్రతీతి. పరమ శివుడికి జగన్మాత దుర్గాదేవికి, సిద్ధి ప్రధాత గణపతికి శమీ పత్రి సమర్పించే ఆచారం అనాధిగా వస్తోంది. శమీ అంటే పాపాలు, శత్రువులను నశింప చేసేదిగా పండితులు చెబుతున్నారు.

పండుగకు ఓ ప్రత్యేకత..

నగర నడిబొడ్డున ఉన్న గుట్టపై 16వ శతాబ్దంలో శ్రీ లక్ష్మీనర్సింహస్వామి వెలిశాడు. దసరా రోజున అడవుల మధ్య ఉన్న ఈ గుట్టపైకి భక్తులు వెళ్లడానికి ఇబ్బందికరంగా ఉండడంతో స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని జమ్మి చెట్టు, బండ ఉన్న ప్రాంతానికి తీసుకొచ్చి భక్తుల దర్శనార్థం ఉంచడం, శమీ పూజలు చేయడం అనాధిగా వస్తోంది. కాల క్రమేణా గుట్టపైకి దారి ఏర్పడడం, జమ్మి బండ వద్ద వేడుకలు జరుపుకోవడం చేస్తున్నారు. దసరా రోజున స్వామి వారిని గుట్టపై ఆలయం నుంచి పల్లకి సేవలో ఊరేగిస్తూ జమ్మిబండ రాతిమండపం పైకి తీసుకొచ్చి భక్తుల దర్శనార్థం ఉంచుతారు. ప్రభుత్వ లాంఛనాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా ప్రజా ప్రతినిధులు, కలెక్టర్, అధికారులు పాల్గొని శమీ పూజలు చేస్తారు.

ఆలయాలు ముస్తాబు..

దసరా వేడుకలను వైభవంగా జరుపుకునేందుకు విద్యుత్ దీపాలతో ఆలయాలు ముస్తాబయ్యాయి. మామిడి తోరణాలతో భక్తులను ఆహ్వానించే విధంగా తీర్చిదిద్దారు. భక్తుల దర్శనం కోసం, జమ్మి చెట్టు వద్ద పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ప్రత్యేక ఏర్పాట్లు చేశాం..



దసరా పండుగను పురస్కరించుకుని నగరంలోని జమ్మిబండపై శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దర్శనార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. ప్రత్యేక దర్శనాలకు బారికేడ్లను ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులకు మంచినీటి సౌకర్యం, తీర్థ ప్రసాదాలను అందించనున్నాం. వైభవంగా వేడుకలు జరిగేలా అన్ని ఏర్పాట్లు చేశాం.

– కొత్తూరు జగన్మోహన్‌రావు, శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి

విశేష పూజలు.. అన్నదానాలు

ఆలయాలు, మండపాల్లో కొలువుదీరిన అమ్మవారు శుక్రవారం మహంకాళీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి హోమం, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. – సాక్షినెట్‌వర్క్



ఖమ్మంగాంధీచౌక్: మహంకాళీ అవతారంలో అమ్మవారు



ఖమ్మంగాంధీచౌక్: కవిరాజ్‌నగర్‌లో పూజలు చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి సతీమణి నందిని



కామేపల్లి: అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు



తిరుమలాయపాలెం: ఎదుళ్లచెరువులో పూజలు నిర్వహిస్తున్న మహిళలు



నేలకొండపల్లి: అమ్మగూడెంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం



రఘునాథపాలెం: వీవీపాలెంలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

సమస్యలు చెప్పండి.. పరిష్కరించే బాధ్యత నాది

రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



సమీక్షలో సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు చెప్పాలని, వాటిని పరిష్కరించే బాధ్యత తనదేనని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం కూసుమంచిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నాయకులు, అధికారులతో నిర్వహించిన నేలకొండపల్లి మండల సమీక్ష సమావేశంలో మాట్లాడారు. గ్రామాల వారీగా సమీక్ష నిర్వహించగా, ఆయా గ్రామాల్లోని సమస్యలను, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సమావేశంలోనే అధికారులను మంత్రి ఆదేశించారు. నేలకొండపల్లి మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణం చేపట్టాలని, 108 కొత్త వాహనం కేటాయించాలని, ప్రభుత్వాస్పత్రిలో మందుల కొరత లేకుండా చూడాలని, సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించాలని స్థానిక నాయకులు మంత్రికి వివరించగా సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో నేలకొండపల్లి మార్కెట్ చైర్మన్ వెన్నుపూసల సీతారాములు, నాయకులు రావెళ్ల కృష్ణారావు, బచ్చలికూరి నాగరాజు, జెర్రిపోతుల సత్యనారాయణ, పెంటమళ్ల పుల్లమ్మ, గరిగేపల్లి రామారావు, బోయిన వేణు, పాకనాటి కన్నారెడ్డి, సంగీత, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు సన్మానం



భట్టిని సన్మానిస్తున్న దేవరకొండ సైదులు

ఖమ్మం సహకారనగర్: యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను రూపకల్పన చేసి పేద వర్గాల విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు మాట్లాడుతూ రాష్ట్రంలో బలహీనవర్గాలకు ప్రాథమిక స్థాయి నుంచి నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

నీరు సాఫీగా వెళ్లేలా చూడాలి



బూడిదంపాడులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల

రఘునాథపాలెం: గ్రామాల్లో నీరు సాఫీగా వెళ్లేలా రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈజీఎస్ నిధులు రూ. 27 లక్షలతో పుటానితండాలో అంతర్గత రోడ్లు, రూ.1.36 కోట్లతో బూడిదంపాడులో సీసీ రోడ్లు, డ్రెయిన్, రూ. 10 లక్షలతో సూర్యతండాలో రోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్ డీఈ మహేష్, ఏఈ చిరంజీవి, ఎంపీడీఓ అశోక్, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, విత్తన గిడ్డంగి చైర్మన్ రాయల నాగేశ్వరరావు, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సాధు రమేష్‌రెడ్డి, మానుకొండ రాధాకిషోర్, మల్లీదు జగన్, గుత్తా వెంకటేశ్వర్లు, యరగర్ల హనుమంతురావు, కొంటిముక్కల నాగేశ్వరరావు, తుమ్మలపల్లి చిన్న వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి నర్సింహారావు, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు..

ఖమ్మంగాంధీచౌక్: శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఖమ్మం నగరంలోని రిక్కాబజార్‌లో ఉన్న అంభా భవాని దేవాలయంలో అమ్మవారిని శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దర్శించుకున్నారు. పూజలు చేశారు. మంత్రి వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతి

తిరుమలాయపాలెం: మండలంలోని జల్లేపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కాంగ్రెస్ నాయకుడు రేఖ ముత్తయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. మృతి పట్ల పలు పార్టీల నాయకులు సంతాపం తెలిపారు. జల్లేపల్లిలో ముత్తయ్య మృతదేహాన్ని డీసీసీబీ డైరెక్టర్ చావా వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భాషబోయిన వీరన్న, ఉపాధ్యక్షులు ఆర్మీ రవి, తమిర వెంకట్‌రెడ్డి, పోట్ల జగదీష్, హనుమంతరావు, శ్రీనివాస్, రాములు, ఉప్పలయ్య తదితరులు సందర్శించి నివాళులర్పించారు

దసరా సందడి..



ఖమ్మం బస్టాండ్‌లో కిక్కిరిసిన ప్రయాణికులు

ఊరూవాడా శనివారం దసరా వేడుకలకు సిద్ధమయ్యాయి. పండుగకు సొంత గ్రామాలు, బంధువుల ఇళ్లకు పలువురు తరలివెళ్తుండటంతో ఆర్టీసీ బస్టాండ్లు సందడిగా మారాయి. బస్సులు కిక్కిరిశాయి. ఖమ్మం బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఖమ్మం నగరంలోని జమ్మిబండ వేడుకలకు ముస్తాబైంది. శమీ పూజ, పారువేటకు ఏర్పాట్లు చేస్తారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

'మరో మజిలి' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని గట్టయ్యసెంటర్‌కు చెందిన కవి డాక్టర్ ఆంజనేయులు రచించిన మరో మజిలి పుస్తకాన్ని నగరంలోని బైపాస్ రోడ్డు ఎఫ్‌సీఐ గోదాముల వద్ద ఉన్న మైస్కూల్‌లో కవులు, రచయితలు, సాహితీవేత్తలు గురువారం రాత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యావేత్త, సామాజిక ఉద్యమకారులు సుంకర శ్రీనివాసరావు, ముల్కలపల్లి సంగమేశ్వర్, వురిమళ్ల సునంద, ఆవుల వీరభద్రం, మేడగాని శేషగిరి, పోతగాని సత్యనారాయణ, బెక్క సత్యనారాయణ, ముల్క సురేష్, లెనిన్ శ్రీనివాస్, దేవయ్య, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, దశరథ్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్మికులకు దుస్తుల పంపిణీ

నూతన దుస్తులు పంపిణీ..

ఖమ్మం మయూరిసెంటర్: నగరంలోని 35వ డివిజన్‌లో విధులు నిర్వర్తిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు శుక్రవారం దసరా సందర్భంగా కొత్త బట్టలు పంపిణీ చేశారు. ఇటీవల వరదల సమయాన కార్మికులు ఎనలేని సేవలు అందించారని, అందుకే కృతజ్ఞతగా బట్టలు అందజేసినట్లు డివిజన్‌కు చెందిన గరికపాటి వెంకట్రావు, కార్పొరేటర్ యల్లంపల్లి వెంకట్రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో తమ్మినేని రంగారావు, శ్రీను, వల్లూరుపల్లి వెంకటరెడ్డి, చిట్టూరి బాబు, నల్లమల్ల గోపి, తోట ఉపేందర్, అయితేగాని కృష్ణ, పులుసు సత్యం తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు..



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: మున్నేరు వరద ముంపు బాధితులకు బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మార్తి వీరభద్రప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మంలోని 37వ డివిజన్‌లో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. వంట సామగ్రి అందించారు. ఈ కార్యక్రమంలో సూరి విష్ణు, పసుమర్తి జనార్దన్, పల్లపు వెంకన్న, గుర్రం నాగేందర్, పాపనినాగ, వెంకటేశ్వర్లు, మారుతి శేషు తదితరులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | రమేష్, ACO - 9059115968
ఖమ్మం ఎస్. ఉపేందర్ - 99591 24151 | మధిర వీరబాబు - 98498 64638
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990 | సత్తుపల్లి జి. బాబు - 79979 58225
వైరా ఐ. రాందాస్ - 98898 81843 | టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి – పాఠక మహాశయులకు విజ్ఞప్తి – Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

ఎస్. శేషయ్య - 99121 99148
జి. నర్సింహారెడ్డి - 97054 44181
ఎస్.కె. పాషా - 97054 44182
పి. నందకుమార్ - 90102 99957